# ఓ మగాడి కోరిక !

'ఈసురోమని మనుషులుంటే దేశమే గతి బాగుపడునోయ్...' అని ఎవరన్నారో గాని ఎనిమిది గంటలు నిర్విరామంగా ఆఫీసులో పనిచేసి, వంచిన నడుము ఎత్తకుండా కష్టపడి... చివరిగా నాలుగు సిటీబస్సులు మారి కొంపకి చేరుకునే సరికి రాత్రి ఏడుగంటలు దాటుతుంది.

యాంత్రికంగా ఒంటినున్న బట్టలు మార్చుకుని శ్రీమతి అందించిన వేడివేడి ఫిల్టర్ కాఫీ తాగేసి ఈజీఛైర్లో వాలిపోగానే కళ్ళు మూతలు పడతాయ్.

"ఇప్పుడేం నిద్రండీ బాబూ!? లేవండి!... లేచి కాసిన్ని వేన్నీళ్ళు ఒంటిమీద పోసుకోండి! అలసట అదే తీరుతుంది..." శ్రీమతి గ్రామ్‌ఫోన్ పాటలాగా రోజూ చెప్పే మాటే ఆమె నోటినుండి రాగానే అలసిపోయి పడుకున్న నాకు చిర్రెత్తుకొచ్చింది. ఒళ్ళు మండింది!

"సింపుల్‌గా ఓ కప్పు కాఫీ ఇచ్చి అలా ఎదురుగా నిలబడకపోతే... కాస్తంత కాళ్ళు ఒత్తరాదూ?... కాళ్లలో నరాలు జివ్వున లాగుతుంటేనూ?" అసహనంగా నొసలు చిట్లించి శ్రీమతి ముఖంలోకి చూశాను.

"నాకు అవతల బోలెడంత పనుంది ఇంట్లో. మీకు సేవలు చేస్తూ కూర్చోవటానికి నాకు తీరికెక్కడిదీ..." కాఫీ కప్పు తీసుకుని దీర్ఘాలు తీస్తూ దులబరించుకుని వంటింట్లోకి తుర్రుమంది శ్రీమతి శారద.

'నిజంగా మీ ఆడాళ్లున్నారే...' ఎందుకులే!?... మిమ్మల్ని నిందిస్తే మహిళా సంఘాలు నా మీద దండెత్తుతాయ్! అంటూ వాపోతూ నాలో నేనే మౌనంగా గొణుక్కుని నా మనసుకి సర్దిచెప్పుకోక తప్పలేదు.

అయినా ఈ రోజుల్లో కూడా భర్తకి సేవలు చేసే ఆడాళ్ళు వున్నారంటే అస్సలు నమ్మబుద్ధికాదు.

నా ఆలోచన యాభైయేళ్ళ వెనక్కి పరుగెత్తింది. మా నాన్న సెకండరీ గ్రేడ్ బడిపంతులు! నాకప్పటికి ఎనిమిదేళ్ళు. బడిగంటలు ముగియగానే నాలుగుమైళ్ళు నడిచి ఇల్లు చేరుకునే మా నాన్నని చూస్తే పాపం అన్పించేది.

ఆ రోజుల్లో ఇంట్లో కాఫీ గట్రా లేవు గనుక... స్కూలు నుండి రాగానే మా నాన్న బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోయేవాడు. ఫోన్లో ఎవరో చెప్పినట్టు మా నాన్న చెప్పుల సవ్వడి విని, చేస్తున్న పని ఆ పళాన వదిలేసి మంచినీళ్ళ గ్లాసుతో మా అమ్మ పట్టెమంచం దగ్గరకొచ్చి చేతిలో నీళ్ళగ్లాసుని నాన్నకు అందించేది.

నీళ్ళు తాగి మళ్ళీ వాలిపోయిన మానాన్న కాళ్ళదగ్గర శ్రీమహావిష్ణువు కాళ్ళదగ్గర శ్రీమహాలక్ష్మి కూర్చున్నట్టు అమ్మ కూర్చుండిపోయి నాన్నగారి పిక్కలు, పాదాలు మర్దన చేసేది. అరికాలి మంట తగ్గటానికని ఆముదం తెచ్చి అరికాళ్లకి రాసేది. అలా మా అమ్మ సేవ చేస్తూంటే నాన్నగారి కళ్ళు మూతలు పడేవి. అటుపై అమ్మ వంటింట్లో కెళ్ళి ఆమె పనేదో చేసుకునేది. ఆ సంఘటన ఇప్పటికీ నా కళ్లముందు మెదుల్తూ వుంటుంది.

అలాంటి భార్య దొరకటం భర్త అదృష్టమనే చెప్పాలి!

నాకు పెళ్ళై నలభైయేళ్ళు దాటినా ఏ ఒక్కరోజు నా భార్య శారద నాకు సేవచేసి ఎరగదు.

పైగా భర్తకు సపర్యలు చేయడం నామర్దాగానూ... నామోషిగానూ అన్పిస్తుందేమో నేటి స్త్రీలకి. శ్రమపడి వచ్చిన భర్త దరిదాపులకే రారు. ఖర్మ!

అదేమంటే... భర్త రాచిరంపాన పెడుతున్నాడని... బండెడు చాకిరీ చెయ్యలేక చస్తున్నామనీ వాపోతారు! ఇదెక్కడి చోద్యమండీ బాబూ?! అదేమంటే... కట్టుకున్న మొగుడికి ఇల్లే పట్టదని... ఇంటిపనుల్లో వంటపనుల్లో కొంచెం కూడా సహకరించటంలేదంటూ ఇరుగుపొరుగు అడంగులతో చెప్పుకుని బావురుమంటారు.

మా కష్టాలు తీర్చేవారులేరని ఘొల్లుమంటారు. అసలు నన్నడిగితే సగటు ఆడదానికి ఇంటా బయటా స్వాతంత్ర్యం ఎక్కువైపోయింది. అన్నింటికీ అర్గ్యుమెంట్స్! నోరెత్తితే చాలు కొళాయి తిప్పేస్తారు. ఆడవాళ్ళు ఏడ్చి గెలుస్తారనేది అక్షరసత్యం!

మొగుడి మొర ఆలకించి సపర్యలు చేస్తున్న ఒక్క భార్యని చూపించండి చాలు! ఉరేసుకుంటాను.

హోండిపార్ట్‌మెంట్‌తో సరిపెట్టుకోకుండా ఆర్థికశాఖను సైతం హస్తగతం చేసుకునే ప్రయత్నంలోనూ సఫలమౌతున్నారా? వంటింట్లో మొగుడ్ని సైతం అడుగుపెట్టనీయరు. అది వాళ్ళ సొంత సామ్రాజ్యం!

పిల్లల్ని సైతం తండ్రి కోప్పడితే తల్లికి చిర్రెత్తుకొస్తుంది. మీరు కోప్పడి... కొడితే అందరికీ అలుసైపోతారు పిల్లలు, అంటూ మొగుణ్ణి చూసి గుడ్లురుముతారు... కళ్ళెర్రచేస్తారు- అది అడనైజం.

'ఒరే', 'అరే' అంటూ మొగుడు వెధవని చప్రాసీగాణ్ణి పిల్చినట్టు పిలవటం... అదేమంటే అదే నాగరికం అనటం అదీ కాకపోతే మమ్మల్ని ఒసేవ్... ఏమేవ్ అని పిల్చినప్పుడు మేమ్మాత్రం మిమ్మల్ని అంటే ఏం తప్పట? అంటూ ఎదురుదాడి. ఇదీ వీళ్ళ తంతు!

ఏది ఏమైనా... ఎవరెన్ని అన్నా... పాతరోజులే బాగున్నాయ్! భర్తంటే భయమూ, భక్తీ ఉండేవి. ఇప్పుడవి మృగ్యం! ఏం చేస్తాం? కాలమహిమ అని నోరు నొక్కుకోక తప్పటంలేదు

నాలాంటి భర్తలు!

అసలు టీ.వీ.లు... సెల్‌ఫోన్లు వచ్చాక ఆడాళ్ళు మరీ పేట్రేగిపోతున్నారండీ బాబూ! నా బాధ అదే!

స్త్రీకి స్వాతంత్ర్యం కావాలంటున్నారు. నిజమే! కానీ స్వాతంత్ర్యం మగాడికెక్కడ ఏడ్చిందని? ఇంట్లో భార్యామణి దగ్గర... బయట ఆఫీసులో బాస్ దగ్గరా చేతులు కట్టుకుని ఊడిగం చేస్తున్న మగాడికి మాత్రం స్వాతంత్ర్యం వున్నదంటారా? లేదు. ఖచ్చితంగా లేదుగాక లేదు. ఘంటాపథంగా బల్లగుద్ది చెప్పగలను.

రానురాను మగాణ్ణి అదే మొగుణ్ణి 'వాజమ్మ'లాగ 'చవటాయి'లాగ కథల్లో, సినిమాల్లో, టీవీ సీరియల్స్‌లో చిత్రీకరించి చిత్రహింసలపాలు చేస్తున్నారని మొత్తుకుంటుంటే నా వేదనకు, రోదనకి విలువ లేకుండా పోతోంది. నా వాదన అరణ్యరోదనే అవుతోంది!

కట్టుకున్న భార్య మాట వినదు. కడుపున పుట్టిన సైన్యమూ అంతే! ఖర్చుకి డబ్బు కావాలన్నా... షాపింగ్‌లకు, సినిమాలకు, హోటళ్లకూ వెళ్ళాలన్నా... వాళ్ళని వెంటేసుకుని తిప్పాలన్నా మొగుడు (తండ్రి) కావాలి.

అందుకే ఒక్కోసారి అన్పిస్తుంది... ఎందుకు మగాడిగా (మొగుడిగా) పుట్టానా అని? ఎంచక్కా ఆడదానిగా పుట్టివుంటే మగవెధవల్ని వెంట తిప్పుకుంటూ ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి, నిద్రపట్టకుండా చేసే అవకాశం వుండేది కదా అని!

ఏంచేద్దాం? అంతా ప్రారబ్ధ ఖర్మ! వచ్చే జన్మలోనైనా నన్ను ఓ అందమైన ఆడదానిగా పుట్టించు భగవాన్!

పెళ్లి పెటాకుల్లేకుండా హాయిగా వ్యాపార ప్రకటనల్లో ఫోజులిస్తూనో... అగ్ర నటీమణిగా సినిమాల్లో వెలిగిపోతూనో... ప్రపంచసుందరి పోటీలో నెగ్గి మగాళ్ళని పిల్లిమొగ్గలేయించి, వాళ్ళని కోతుల్లా ఆడించి వెంట తిప్పుకునే భాగ్యం కల్గించు దేవుడా? నా మొర ఆలకించి మరుజన్మంటూ వుంటే... నేను మర్చిపోయినా నువ్వు మర్చిపోకుండా నన్ను 'స్త్రీ'గానే పుట్టించు! ఇంతకుమించి నిన్నేమీ కోరను స్వామీ! శ్రీమన్నారాయణమూర్తీ!

- సమాప్తం -

*(స్వాతి వీక్లీ. 14-12-2007 సంచిక )*